క్లుప్తంగా

మార్మోగిన శివనామస్మరణ

జడ్చర్ల టౌన్: మండలంలోని మీనాంబరం పరుసవేదీశ్వర ఆలయం శివనామస్మరణతో మారుమోగింది. కార్తీకమాసం కావటంతో భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రాత్రి పొద్దుపోయేదాక ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాసదీక్ష చేపట్టిన భక్తులు అభిషేకం, పూజలు చేసి దీక్షను విరమించారు. కార్తీక దీపాలు వెలిగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: మండలంలోని జాతీయ రహదారిపై గాజులపేట స్టేజీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మూసాపేట మండలం బంగ్లగడ్డకు చెందిన ఆంజనేయులు మరో వ్యక్తి ఎర్రన్నతో కలిసి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వైపు నుంచి ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యలో గాజులపేట స్టేజీ దాటిన తర్వాత బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. బైక్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎల్ అండ్‌టీ అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులిద్దరిని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

మహమ్మదాబాద్: బైకుపై వెళుతున్న వ్యక్తులను గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పగిడ్యాల్‌కి చెందిన మాసయ్య, కిష్టయ్య మంగళవారం బైకుపై సల్కర్‌పేట్ సంతకు వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో పగిడ్యాల్ నుంచి వస్తున్న గుర్తుతెలియని కారు వారి బైకును ఢీ కొంది. ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలై కాళ్లు విరిగిపోయాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

జడ్చర్ల: ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని పోలీసులు కాపాడిన ఘటన మంగళవారం జడ్చర్ల సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో చోటు చేసుకుంది. జడ్చర్లకు చెందిన అహ్మద్ భార్య ఇటీవల మరణించింది. దీంతో అతడు మనో మనోవేదనకు గురయ్యాడు. తట్టుకోలేక రైలు పట్టాలపైకి చేరుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ చంద్రమోహన్ తమ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో వారు వెళ్లి రక్షించారు.

మంత్రి పదవి దక్కాలంటూ పూజలు

జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ కేబినెట్‌లో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి చోటు లభించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఫోరం ఫర్ బెటర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ది బాలకృష్ణ, సభ్యులు శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, అశోక్‌కుమార్, శ్రీనివాస్, సాగర్, జంగిరెడ్డి ఉన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందడంతో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.సాయిబాబా, నాయకులు మురళీధర్‌గౌడ్, చారి, జగదీష్, అశోక్, లక్ష్మీనరసింహ, ఆంజనేయులు, లక్ష్మణ్, నరసింహ, రమేష్, ఆకాష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: పరిగి నియోజకవర్గంలో టీ రామ్మోహన్‌రెడ్డి విజయం సాధించడంతో పాటు రేవంత్‌రెడ్డి సీఎం కావాలన్న మొక్కులు తీర్చుకోవడం కోసం ఉమ్మడి గండేడ్ మండల కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లారు. మండలాల అధ్యక్షుడు కేఎం నారాయణ, జితేందర్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన రిషి విద్యార్థులు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లలో నిర్వహించిన అండర్ -17 ఫుట్‌బాల్ జట్ల ఎంపికలో జిల్లా కేంద్రంలోని రిషి పాఠశాల విద్యార్థులు ముస్తఫా, కె .రాహుల్‌లు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం

స్టేషన్ మహబూబ్‌నగర్: జీపీ లేఅవుట్‌లకు సంబంధించి రియల్ ఎస్టేట్స్ ఏజెంట్ల సమస్యలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని రాష్ట్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పులిజాల రవికిరణ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహాదేవప్ప, వైఎస్సార్‌టీపీ నాయకుడు హైదర్‌అలీ, సభ్యులు పాల్గొన్నారు.

వేరుశనగ రైతులకు వెతలు

- ఓ వైపు తెగుళ్లు.. మరోవైపు పందులు
- పట్టి పీడిస్తున్న సమస్యలు



పురుగు బారినపడిన వేరుశనగ



గండేడ్‌లో సాగు చేసిన వేరుశనగ

గండేడ్: పెరిగిన పెట్టుబడి భారంతో కుదేలవుతున్న వేరుశనగ రైతులకు పంటలకు సోకుతున్న తెగుళ్ల బెడద ఓవైపు... మరోవైపు అడవి పందుల దాడులు శాపంగా మారాయి. తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకొనేందుకు ఎన్ని మందులు పిచికారీ చేసిన ఫలితం లేక రైతులు దిగాలు పడిపోతున్నారు. దీంతో లాభం మాట ఎలా ఉన్నా పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ఏటా రైతులు వరి సాగుతో పాటు వేరుశనగ పంట సాగుపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. కానీ ఈ ఏడాది వేరుశనగ సాగు చేసిన రైతుకు కష్టాల కడలిలో ఎదురు ఈదక తప్పడం లేదు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో ఈ ఏడాది 1500 ఎకరాల్లో ఈ పంటను సాగుచేశారు. మహమ్మదాబాద్ మండలంలో ఏటా వరి కంటే వేరుశనగ పంట అధికంగా సాగవుతున్నది. ప్రస్తుతం అదే రీతిలో సాగుచేశారు. ఉమ్మడి మండల పరిధిలోని గాధిర్యాల్, వెంకట్‌రెడ్డిపల్లి, పగిడ్యాల్, బల్సూర్‌గొండ, జిన్నారం, పెద్ద వార్వాల్, కొండెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా సాగు చేశారు. కానీ సాగు చేసింది మొదలు రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఎక్కువ మొత్తంలో బోర్లపైనే ఆధారపడడంతో నీటి సమస్య, తెగుళ్లు, అడవిపందుల దాడులు ఇలా అనేక సమస్యలు వేధిస్తున్నాయి.

పట్టి పీడిస్తున్న పచ్చ పురుగు...

వేరుశనగ సాగుతో ఎంతో కొంత లబ్ధి పొందాలనుకున్న రైతులను పచ్చపురుగు పట్టి పీడిస్తోంది. విత్తనం మొలకెత్తిన పదిహేను రోజుల నుంచి అరవై రోజుల మధ్యలో ఈ పచ్చపురుగు పంటను ఆశిస్తుంది. రైతులు వేరుశనగ వేసి నెలరోజులకు పైగా కావడంతో ఈ పచ్చ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. ఎన్ని మార్లు మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. పైరు ఆకును తినేసి పంటను నాశనం చేసి అధిక దిగుబడికి ఇది అవరోధంగా మారింది. దీంతో పాటు ఆకు ముడుత, నల్ల మచ్చ (టిక్కారోగం) తెగుళ్లు, పచ్చరోగం పైరును ఆశించి పంటను నాశనం చేస్తున్నాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు నిత్యం కుస్తీ పడుతున్నారు. అయినా ఆశాజనక పరిస్థితులు కనబడడం లేదు. వేలకు వేలు తెచ్చి రసాయనిక ఎరువులు పిచికారీ చేసినా మార్పు రావడం లేదు. అసలే చలికాలం కావడంతో పాటు తుఫాను ప్రభావం కారణంగా తెగుళ్ల వృద్ధి చెందేందుకు కారణమవుతోంది. ఎండలు తీవ్రంగా ఉంటే తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుంది. గత వారం పది రోజులుగా వాతావరణంలో మార్పుల వల్ల వేరుశనగ పంటలు దెబ్బతింటున్నాయి.

తప్పని పందుల బెడద..

తెగుళ్ల బెడదకు తోడు అడవిపందుల సమస్య రైతులకు మరింత ఇబ్బందికరంగా మారింది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ అడవి పందుల సమస్య ఉంది. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న కోయిల్‌కొండ, హన్వాడ, మహమ్మదాబాద్, గండేడ్ తదితర మండలాల్లో వీటి సమస్య మరింత తీవ్రంగా ఉంది. గతంలో కేవలం వేరుశనగ పంటనే మాత్రమే నాశనం చేసే పందులు ప్రస్తుతం అన్ని పంటలపై పడుతున్నాయి. వీటి బారి నుంచి పంటను కాపాడుకోవడం రైతులకు కష్ట సాధ్యంగా మారింది. పంట కనిపిస్తే పాపం అడవి పందులు పీకి పందిరేస్తున్నాయి. దీంతో వాటి బారి నుంచి పంటను కాపాడుకోవడానికి రైతుకు కంటిమీద కునుకు కరువు అవుతోంది. రాత్రి వేళల్లో చలికి వణుకుతూ పొలాల దగ్గర పడిగాపులు కాస్తున్నారు. ఈ కష్టాలకు తోడు పెట్టుబడి కూడా ఎక్కువ కావడం, కూలీరేట్లు పెరగడం వంటి సమస్యలూ రైతులను వేధిస్తున్నాయి.

ఆశలు అడుగంటాయి



ఎకరా పొలంలో వేరుశనగ సాగు చేశాం. పంట మొలిచినప్పటి నుంచి ఇప్పటివరకు మందులు పిచికారీ చేస్తూనే ఉన్నాం. పురుగు చావలేదు పంట తిరగడం లేదు. దానిపై పెట్టుకున్న ఆశలన్నీ అడుగంటాయి. ఒకదాని తర్వాత ఒక రోగం వస్తోంది. మందులకే రూ. వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. సాగంటేనే భయం వేస్తోంది.

– మల్కయ్య, వెన్నాచేడ్

కంటికి నిద్రలేదు



మూడెకరాల్లో వేరుశనగా పంటసాగు చేసాను. అడవి పందులు పదుల సంఖ్యలో నిత్యం వస్తున్నాయి. రాత్రికి పొలం వద్దకు కాపలా కోసం వెళ్తున్నాను. కంటి మీద రెప్ప పడితే పాపం.. అందినంత కాడికి తినేస్తున్నాయి. రాత్రులంతా చలికి పొలం వద్ద కాపలా ఉంటున్నాం. పంట రక్షించుకోవడం మాటేమో కానీ అవి ఎక్కడ దాడి చేస్తాయోనన్న భయం కూడా వెంటాడుతుంది.

– తిరుపతయ్య, పుల్పోనిపల్లి, హన్వాడ మండలం

కరాటే విద్యార్థులకు న్యాయం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న కరాటే మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయిలో ఎంపికైన కరాటే విద్యార్థులకు అంతర్‌జిల్లాస్థాయి ఎంపికలకు సమాచారం ఇవ్వకుండా అన్యాయం చేశారని, వారికి న్యాయం చేయాలని కోరుతూ కరాటే మాస్టర్లు అశ్వాక్, పి.లక్ష్మణ్ మంగళవారం జిల్లా కేంద్రంలో డీఈఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది అక్టోబర్ 29న జడ్చర్ల పట్టణంలోని స్టేడియంలో అండర్-14 జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపికలు నిర్వహించగా విద్యార్థులు ఎండీ.అసద్, రహీలు ఎంపికయ్యారని, వీరికి అంతర్‌జిల్లా ఎంపికలు సమాచారం ఇస్తామని చెప్పి ఇవ్వలేదని వినతిలో పేర్కొన్నారు. మంగళవారం నల్గొండలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారన్న విషయం తెలిసిందని, న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్ బాబును వివరణ కోరగా జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి సమాచారం ఇవ్వమని ఎంపికలు నిర్వహించిన కరాటే మాస్టర్‌కు తెలియజేశానని, తాను ఇతర జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులకు సమాచారం ఇచ్చినట్లు సమాధానం చెప్పారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



జిల్లా కేంద్రంలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

సాక్షినెట్‌వర్క్: ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో నాయకులు బాణాసంచా కాల్చి స్వీట్లు నిపించుకున్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ సీఎంగా రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డిని సీఎంగా ఎంపిక చేసినందుకు ఏఐసీసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, ఆనంద్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, సాయిబాబా, అజ్మత్‌అలీ, గంగిరెడ్డి, రాములుయాదవ్ పాల్గొన్నారు. జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాజాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. నాయకులు నరహరి, దోండ్లపల్లి కృష్ణయ్య, గోనెల రమేష్, గోవర్ధన్‌రెడ్డి, తఖీబాబా, నసీర్‌బేగ్ తదితరులు ఉన్నారు.

సంతోషంగా ఉంది..



ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం సంతోషంగా ఉంది. మిడ్జిల్ జెడ్పీటీసీగా పనిచేసిన రేవంత్‌రెడ్డి సీఎం కావడం గర్వకారణం. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుంది.

– మల్లికార్జున్‌రెడ్డి, మున్ననూర్, మిడ్జిల్ మండలం

పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి..



పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి. మిడ్జిల్ జెడ్పీటీసీగా రాజకీయం ప్రారంభించిన ఆయన.. అంచెలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం సంతోషం ఉంది.

– లక్ష్మారెడ్డి, మిడ్జిల్

సైన్స్ కాంగ్రెస్‌లో సత్తా చాటిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. జడ్చర్లలోని శ్లోక స్కూల్ విద్యార్థుల బృందం ఉత్తమ ప్రదర్శన కనబర్చింది. రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు బృందం ఎంపికైనట్లు డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి మద్దతు



మాట్లాడుతున్న ఫారుఖ్ హుస్సేన్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఏర్పాటు కానున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ సంఘం పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.ఇస్రత్‌అలీ, మహ్మద్ అయూబ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వహీద్‌షా, జిల్లా నాయకులు ఖాజా జైనుల్లా అబెదిన్, మహమూద్, అజీం తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఘటనలో మా ప్రమేయం లేదు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని ఎర్రగుట్ట వద్ద డబుల్‌బెడ్‌రూంలు స్వాధీన పర్చుకునే ఘటనలో కాంగ్రెస్ ప్రమేయం ఏమాత్రం లేదని ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు మినాజ్ వెల్లడించారు. సోమవారం కొందరు బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్ కారణంగా ఇళ్లను స్వాధీనపర్చుకునేందుకు ప్రజలు తరలి వచ్చారన్నారు. డబుల్‌బెడ్‌రూంల వద్దకు ప్రజలు వెళ్లటాన్ని తామే మున్సిపాలిటీ కమిషనర్‌కు, పోలీసులకు సమచారం ఇచ్చామన్నారు. ఇళ్లు ఇప్పిస్తామని పేదలతో డబ్బులు లాక్కుని ఎన్నికల ప్రక్రియ ముగియగానే ఇలా ప్రేరేపించారని ఆరోపించారు.

కనీస సామర్థ్యాలు పెంపొందించాలి

రాజాపూర్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సీఎంఓ బాలుయాదవ్ బైకని పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. కాంప్లెక్స్ సమావేశాలు విధిగా నిర్వహించుకోవాలని సూచించారు. తరగతి గదుల్లో మొబైల్‌ఫోన్లు వాడకూడదన్నారు. మండల విద్యాశాఖ అధికారి వెంకటయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆనంద్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దారులపై ధాన్యం..



కోయిల్‌కొండ: మండలం కేంద్రంలో వరి ధాన్యాన్ని రైతులు రోడ్డుపై ఆరబోస్తున్నారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. తరుచూ ప్రమదాలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. ధాన్యం ఆరబోతకు ప్రత్యేక ప్రదేశాలు లేవని అందుకే ఇలా చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

అప్పంపల్లిలో ఘనంగా ఉర్సు



చిన్నచింతకుంట: మండలం అప్పంపల్లి గ్రామంలో రెండు రోజుల పాటు మహబుబ్ స్వాని ఉర్సు ఉత్సవాలు కుల మతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామికి పూలు, గంధం సమర్పించారు. మంగళవారం పాతేహాలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు స్వీట్లు పంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలనుంచి భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. మతపెద్దలు పాష, బషీర్, జుబేర్ మరియూ శంకర్, కమలాకర్, సుదర్శన్, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు నర్సింహులు, పి రాఘవరెడ్డి, మోహన్‌కుమార్, లతోపాటు పలువురు పాల్గొన్నారు.

స్వచ్ఛంద దినోత్సవం

జడ్చర్ల టౌన్: అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం వయో వృద్ధులకు స్వెట్టర్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కొందరికి బియ్యం, సరుకులను అందజేశారు. స్వచ్ఛంద దినోత్సవంతోపాటు ప్రతి ఒక్కరు సేవాభావం అలవర్చుకోవాలని సొసైటీ నిర్వాహకురాలు బాలమణి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు రాధాకృష్ణ, గోపాల్‌గౌడ్, మనీషా, అమీనా పాల్గొన్నారు.

తూకం వేయకుండా ధాన్యం సేకరణ



చౌదర్‌పల్లిలో ధాన్యం సేకరిస్తున్న సిబ్బంది

మహమ్మదాబాద్: చౌదర్‌పల్లిలో నిబంధనలకు విరుద్ధంగా తూకం మిషన్ చెడిపోయిందంటూ ఐకేపీ వీబీకే నేరుగా బస్తాలకు ధాన్యం నింపి రైస్‌మిల్లులకు తరలించిన ఘటన చేసుకుంది. ఇదేమని కొందరు రైతులు ప్రశ్నించగా సంబంధిత నిర్వాహకులు మాత్రం తూకం వేసే మిషన్ చెడిపోయిందంటూ బుకాయించారు. మూడురోజులుగా సుమారు 800లకు పైగా ధాన్యం బస్తాలను తూకం వేయకుండా రైస్‌మిల్లులకు పంపించారు. ఇంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు గ్రామ ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకున్న పాపానపోవడం లేదని గ్రామ రైతులు వాపోతున్నారు. కాగా ఇప్పటికే అమ్మిన ధాన్యంపై ఎలాంటి ట్రాక్‌షీట్‌లుగానీ వేయింగ్ షీట్‌లు గానీ ఇవ్వకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. ఈవిషయమై సంబంధిత ఐకేపీ ఏపీఎం సునీతను వివరణ కోరగా చౌదర్‌పల్లిలో ఇప్పటికీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం రాలేదని తెలిపారు. ధాన్యం సేకరణలో ఎలాంటి అవకతవకలు జరిగినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదవశాత్తు ఆటో దగ్ధం

- డ్రైవర్‌కు తప్పిన ముప్పు



దగ్ధమవుతున్న ఆటో

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల సమీపంలో ప్రమాదవశాత్తు సీఎన్‌జీతో నడిచే ఆటో దగ్ధమైన ఘటనలో డ్రైవర్‌కు ప్రమాదం తప్పిపోయింది. వేముల గ్రామానికి చెందిన అమ్మపల్లి ఆంజనేయులు తన ఆటోలో సోమవారం రాత్రి మూసాపేటకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో తుంకినీపూర్ రోడ్డు వద్ద ఆటోకు ఉన్న సీఎన్‌జీ గ్యాస్ లీకైంది. అకస్మాత్తుగా ఆటోలో మంటలు చెలరేగాయి. వెంటనే గుర్తించిన ఆంజనేయులు ఆటోలోంచి దూకి ప్రాణాలతో బయట పడ్డాడు. గ్యాస్ లీకవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి ఆటో పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.2.60లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆంజనేయులు తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం



అడ్డాకుల: మండలంలోని గౌరిదేవిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో పెద్దవాగు వద్ద గతంలో కాజ్ మంజూరు కాగా శంకుస్థాపన సమయంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి వైపు వాగు ఒడ్డున ఉన్న శిలాఫలకాన్ని సోమవారం రాత్రి ధ్వంసం చేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు.

ఆదిఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఆదిఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాస మంగళవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘవేందర్‌రావు తెలిపారు. స్వామివారిని అలంకరించి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించామన్నారు.

మరింత బాధ్యతలో పనిచేద్దాం



అడ్డాకుల: నాయకులు, కార్యకర్తలు అందరూ కష్టపడి పనిచేసి అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డిని గెలిపించారని, ఇక నుంచి ప్రజా సేవలో మరింత బాధ్యతతో పనిచేద్దామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టి శేఖర్ అన్నారు. మూసాపేట మండల కేంద్రంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో జరిగే వివిధ ఎన్నికల్లోనూ విజయభేరి మోగించేలా పని చేయాలని కోరారు. బగ్గి కృష్ణయ్య, రామన్‌గౌడ్, బాలనర్సిములు, సాయిరెడ్డి, సంతోషి, ఎన్‌టీగౌడ్, సత్యం, నిరంజన్, కృష్ణయ్య, రాజేందర్‌రెడ్డి, రాంచందర్, మహేందర్ తదితరులు ఉన్నారు.

నర్సరీ పనులను వేగవంతం చేయండి

కోయిల్‌కొండ: మండలంలో చేపడుతున్న నర్సరీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం మండలంలోని ఆచార్యాపూర్ గ్రామంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఆయన అన్నారు. ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: గ్రామాల్లో ఉన్న నర్సరీలలో మట్టి పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీలత సూచించారు. మంగళవారం ఆమె పంచాయితీ సిబ్బందితో మాట్లాడుతూ నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసి వెంటనే పనులు చేపట్టాలని పేర్కొన్నారు.



కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్‌శాఖ ఆధ్వర్యంలో ఐఎస్‌ఎల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4న నిర్వహించిన ఇంటర్ కళాశాల కరాటే టోర్నమెంట్‌లో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో క్లబ్ విద్యార్థి మహ్మద్ అర్ష్ జమీల్ బంగారు పతకం సాధించి మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్‌లో త్వరలో జరిగే సౌత్‌వెస్ట్ జోన్ యూనివర్సిటీ కరాటే టోర్నమెంట్‌కు ఎంపికై నట్లు తెలిపారు. అదే విధంగా క్లబ్‌కు చెందిన మరో విద్యార్థి ఉజేఫ్ షరీఫ్ కుమితే విభాగంలో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ, ఐఎస్‌ఎల్ కళాశాల స్పోర్ట్స్ డైరెక్టర్ అలీలు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్ జహంగీర్‌పాష ఖాద్రీ, క్లబ్ సభ్యులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.